క్లుప్తంగా

ఘనంగా తెలుగు రంగస్థల దినోత్సవం



గుడివాడరూరల్:గుడివాడ పట్టణంలోని షాగులాబ్‌చంద్ ప్రథమశ్రేణి గ్రంథాలయంలో తెలుగు భాష వికాస సమితి ఆధ్వర్యంలో తెలుగు రంగస్థల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వికాస సమితి ప్రతినిధి గాదే మోహన్‌బాబు నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో విశ్రాంత గ్రంథాలయ ఉద్యోగి అవిర్నేని వెంకటేశ్వరరావును వికాస కమిటీ సభ్యులు, పాఠకులు సత్కరించారు. గ్రంథాలయ అభివృద్ధికి అవిర్నేని చేసిన సేవలు ప్రశంసనీయమన్నారు. తెలుగు రంగస్థలానికి దశాబ్దాల చరిత్ర ఉందన్నారు. రంగస్థలం నుంచే సినీ పరిశ్రమ పుట్టుక వచ్చిందన్నారు. నాటకాలను నిర్లక్ష్యం చేయకుండా భవిష్యత్‌లో కొనసాగించాలని వికాస సమితి సభ్యులు పేర్కొన్నారు. తెలుగు అధ్యాపకులు మెండూరి సాయిలక్ష్మి, జి.మాల్యాద్రి, మాధవరావు, బచ్చు జగన్, వెంకటమురళీకృష్ణ, కొల్లిపర వెంకట నరసింహారావు, గ్రంథాలయ ఉద్యోగి ప్రవల్లిక పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులు మేలు

కైకలూరు: ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులు మేలని ప్రకృతి వ్యవసాయ డిజిటల్ సీఆర్పీ గౌతమ్ కుమార్ చెప్పారు. వేమవరప్పాడులో పచ్చిరొట్ట పైర్ల పెంపకంపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ 30 రకాల పచ్చిరొట్ట విత్తనాలకు సంబంధించి 12 కేజీల చొప్పున దాదాపు 100 కిట్స్ రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటితో పాటు కాషాయాలు, ద్రావణాలు సైతం అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దేవస్థానంలో ఎయిర్ కూలర్స్ ప్రారంభం



మోపిదేవి: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఏర్పాటు చేసిన మూడు ఎయిర్ కూలర్స్‌ను అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు ఆదివారం ప్రారంభించారు. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు మాట్లాడుతూ స్వామివారి దర్శనార్థం నిత్యం ఆలయంకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఎండోమెంట్ నిధులు సుమారు రూ. ఒక లక్షతో మూడు ఎయిర్ కూలర్స్ ఏర్పాటు చేశామన్నారు. తొలుత ఎమ్మెల్యే రమేష్‌బాబు, నరసింహారావు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

చలివేంద్రం ఏర్పాటు..

వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆదివారం ప్రారంభించారు. వేసవిలో భక్తుల దాహార్తిని తీర్చేందుకు రెండు నెలల పాటు నిత్యం మజ్జిగ పంపిణీ చేయనున్నట్లు ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు తెలిపారు. సర్పంచ్ నందిగం మేరీరాణి, మండల బీసీ కన్వీనర్ రాజులపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హంసలదీవి తీరంలో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

కోడూరు: హంసలదీవి సాగరతీరంలో హెచ్చరిక బోర్డులను అటవీ శాఖాధికారులు ఎట్టకేలకు ఏర్పాటు చేశారు. సంగమం వద్ద ఎక్కువ లోతు ఉన్న నేపథ్యంలో ఇటీవల పెనమలూరుకు చెందిన యువకుడు ప్రమాదశాత్తు ఈ ప్రాంతంలో గల్లంతయ్యాడు. తీరంలో పోలీసులు, అటవీ అధికారులు ఏవిధమైన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ఈ ప్రాంత పరిస్థితులపై పర్యాటకులకు అవగాహన ఉండడం లేదు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని విమర్శలు తలెత్తడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. సంగమం వద్ద లోతును తెలియజేస్తూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

ఆకట్టుకున్న పౌరాణిక నాటక ప్రదర్శనలు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం వార్షికోత్సవం, తెలుగు నాటక దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా రెండో రోజైన ఆదివారం కళాకారులు ప్రదర్శించిన పలు పౌరాణిక నాటక ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. శ్రీ రామాంజనేయ యుద్ధం, మయసభ ఘట్టాలను కళాకారులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా కళాకారులను వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్ గూడవల్లి నాగరాజు, 2వ డివిజన్ కార్పొరేటర్, కళాకారుల సంక్షేమ సంఘం ముఖ్య సలహాదారుడు పరింకాయల విజయచంద్రకుమార్ ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ నాటక ప్రదర్శనలను ఆదరించి కళాకారులను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 44వ డివిజన్ ఇన్‌చార్జి మామిడిబత్తుల అజయ్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా అర్హులకు సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు



సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

మండవల్లి: ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) పేర్కొన్నారు. మండలంలోని ఉనికిలిలో సర్పంచ్ ఇమ్మడి అన్నమ్మ, ఎంపీటీసీ ఆగస్తీ ఆదివిష్ణు ఆధ్వర్యంలో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ మాదు శివరామకృష్ణతో కలిసి ఎమ్మెల్యే డీఎన్నార్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల బ్రోచర్లను అందజేశారు. గ్రామంలో రూ. 62 లక్షలతో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్, గ్రామ సచివాలయం రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రం అమలు చేయలేని సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందజేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి అందజేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ అందుతున్నాయన్నారు. ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, జెడ్పీటీసీ ముంగర విజయనిర్మల, సర్పంచ్ ఇమ్మడి అన్నమ్మ, వైఎస్ ఎంపీపీ ఆగస్తీ ఆదివిష్ణు, మండల పార్టీ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ హనుమంత పార్వతి, చేబోయిన వీర్రాజు, పెరుమాళ్ల సత్యనారాయణ, మెండా సురేష్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు బి.యేసోబురాజు, వైఎస్సార్ సేవాదళ్ అధ్యక్షుడు భలే నాగరాజు, మండల పార్టీ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, కో ఆప్షన్ సభ్యుడు దత్తాడ నరసింహారావు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు బేతపూడి యేసోబురాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు నిమ్మగడ్డ చిన్న, బొమ్మనబోయిన గోకర్ణయాదవ్, మెండా సురేష్, పలువురు సర్పంచ్‌లు, ఎస్సైలు టి.రామకృష్ణ, మణికుమార్, ఏఈ రామకృష్ణ బొబ్బిలి రత్తయ్య నాయుడు, కారే ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

కందుకూరి గొప్ప సంఘ సంస్కర్త



మల్లిక్‌ను కందుకూరి అవార్డుతో ఘనంగా సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

గుడివాడరూరల్:సమాజంలో ఉన్న అసమానతలను రూపుమాపి వితంతువులకు పునః వివాహం చేసిన గొప్ప సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు అని గుడివాడ స్పందన ఆర్ట్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు గవిర్నేని బాబూశ్రీకర్ అన్నారు. సంఘ సంస్కర్త కందుకూరి జయంతిని తెలుగు నాటక రంగ దినోత్సవంగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కన్యకాపరమేశ్వరి దేవస్థాన ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బాబూ శ్రీకర్ మాట్లాడుతూ సామాజిక రుగ్మతలుగా ఉన్న బాల్య వివాహాలు, వరకట్న దురాచారాన్ని వ్యతిరేకిస్తూ వీరేశలింగం పంతులు ఎన్నో ఉద్యమాలు నడిపారన్నారు. మహిళలు వారి కాళ్లపై వాళ్లు నిలబడేటట్లుగా చేశారన్నారు. చిన్న వయస్సులోనే భర్తలు మరణించిన స్త్రీలకు మరలా వివాహాలు వీరేశలింగం పంతులు ప్రోత్సహించి చేయడం గర్వకారణమన్నారు. చార్లీచాప్లిన్ కామెడీ క్లబ్ వ్యవస్థాపకుడు నరహరశెట్టి ప్రసాద్ మాట్లాడుతూ అనేక హాస్యపాత్రలను అవలీలగా మెప్పించిన చార్లీచాప్లిన్, కందుకూరి వీరశలింగం జయంతి ఒకేరోజు రావడం అదే రోజు తెలుగునాటక రంగ దినోత్సవం కావడం హర్షణీయమన్నారు. తొలుత గోగులమ్మ అన్నమాచార్యుల కీర్తనలు ఆలపించగా నక్కా సాంబశివరావు భాస్కర్ సంగీత సహకారాన్ని అందించారు. అనంతరం ప్రముఖ నటుడు, దర్శకుడు సుకమంచి మల్లిక్‌ను సంఘ సభ్యులు సత్కరించారు. కందుకూరి అవార్డుతో మెమోంటో అందచేశారు. చార్లీచాప్లిన్ క్లబ్ ఉపాధ్యక్షుడు మట్టా రాజా, కళాకారుల సమైక్య గౌరవాధ్యక్షుడు బీఆర్ మోహన్‌రెడ్డి, విశ్రాంత ప్రిన్సిపాల్ ఎంవీజీ ఆంజనేయులు, నటుడు, ఉపాధ్యాయుడు ఆర్‌వీఎల్ నరసింహారావు, శ్రీశ్రీ కళావేదిక గుడివాడ అధ్యక్షుడు పుల్లేటికుర్తి శ్రీను బాబు, నవ్వుల పొదరిల్లు అధ్యక్షుడు ఎంఎస్‌వి సత్యనారాయణ, కళాకారుల సంక్షేమ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కందుకూరి కృషి ప్రశంసనీయం

మండవల్లి: బాల్య వివాహాల రద్దుకు శ్రమించిన ప్రజ్ఞాశాలి కందుకూరి వీరేశలింగం అని సామాజిక వేత్త ఎల్ఎస్ భాస్కరరావు కొనియాడారు. స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి షేక్ పర్వీన ఆధ్వర్యంలో ఆదివారం వీరేశలింగం 176 వ జయంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా భాస్కరరావు, టి.అప్పారావు, కె.నాగబాబు, షేక్ పర్వీన మాట్లాడుతూ ఆంధ్ర సమాజాన్ని సంస్కరణల బాట పట్టించిన గొప్ప సంస్కర్త, హేతువాది కందుకూరి అని కొనియాడారు.

కరెంటు తీగలు తగిలి వరి గడ్డి దగ్ధం



పెదపూడి(మొవ్వ): కరెంటు తీగలు తగిలి ఐదెకరాల వరిగడ్డి వామి దగ్ధమైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. గుడివాడ గ్రామానికి చెందిన పరిటాల శివ భారతి లారీపై ఆదివారం మొవ్వ మండలం పెదపూడి నుంచి కాకినాడ జిల్లా పెద్దాపురంకి గడ్డివాము తరలిస్తుండగా మొవ్వ మండలం పెదపూడి గ్రామం శివారులోని పాలకేంద్రం వద్ద విద్యుత్ తీగలు తగిలి ప్రమాదం జరిగిందని ఫైర్ అధికారి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ ప్రమాదంలో రూ.45 వేల విలువ గల గడ్డివాము కాలిపోగా, లారీ పాక్షికంగా దెబ్బతిని రూ. 30 వేల నష్టం వాటిల్లిందన్నారు.

పేకాట శిబిరాలపై పోలీసుల దాడులు

పామర్రు:మండల పరిధిలో నిర్వహిస్తున్న పేకాట శిబిరాలపై దాడులు నిర్వహించి 12 మందిని అదుపులోకి తీసుకున్నట్లు పామర్రు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఎలకుర్రు, కురుమద్దాలి గ్రామాల్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరాలపై దాడులు చేశామన్నారు. 12 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.7,975 నగదు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



గుడివాడరూరల్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని రూరల్ సీఐ కేఎస్‌వీ జయకుమార్ తెలిపారు. మండలంలోని బిళ్లపాడు గ్రామంలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మెరుగుమాల కాళీ, గుడివాడ పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు గొర్ల శ్రీనులతో కలసి ఆదివారం సీఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగించడంతో పాటు శారీరక దారుఢ్యాన్ని పెంచుతాయని చెప్పారు. క్రీడల పట్ల ప్రతి ఒక్కరూ ఆసక్తి కనబర్చాలన్నారు. యువత క్రీడల పట్ల ఆసక్తి చూపడంతో పాటు స్నేహపూర్వక వాతావరణంలో క్రీడలను కొనసాగించాలని సూచించారు. మనదేశంలో క్రికెట్‌కు ఉన్న ఆదరణ మరే క్రీడకు లేదన్నారు. క్రికెట్ పోటీలను ప్రతి ఒక్కరూ ఆస్వాదించి ఆనందించాలన్నారు. కాళీ మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. ఆటల పోటీల్లో రాణించే క్రీడాకారులకు ప్రోత్సాహకాలతో పాటు ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. బిళ్లపాడులో యువత ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఆలీ బేగ్, కర్రే నాని, అట్లూరి శశి, కిరణ్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై ప్రజల్లో పూర్తి సంతృప్తి

ఎమ్మెల్యే డీఎన్నార్



దొడ్డిపట్ల గ్రామంలో జరిగిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో పూర్తి స్థాయిలో సంతృప్తి ఉందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి విశేష స్పందన కనిపిస్తోందని తెలిపారు. కైకలూరు మండలంలో దొడ్డిపట్ల, వదర్లపాడు, వరహాపట్నం, రాచపట్నం గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి 20 వరకు 14 రోజులు పాటు రాష్ట్ర వ్యాప్తంగా పీపుల్స్ పోల్ నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో కోటి 60 లక్షలు కుటుంబాలు ఉండగా 7 లక్షల మంది వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులైన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికి వెళ్లి ఈ సర్వే నిర్వహిస్తున్నారన్నారు. ఎంపీపీ అడవి కృష్ణ, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు భట్రాజు శివాజీ, సర్పంచుల సంఘ మండలాధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, సర్పంచులు ఉప్పలపాటి నాగమణి, అల్లూరి మంగారావు, ఎంపీటీసీ సభ్యులు ఈదా కృష్ణవేణి, పండు గాంధీ ప్రసాద్, నాయకులు ఉప్పలపాటి జయదేవ్, చవల రజనీకాంత్, ఘంటసాల సురేష్; వాసుపల్లి రమేష్, కోనాల జయరాజు, ప్యాట్రిక్ పాల్, గరికిముక్కు ఏసు, సచివాలయ సన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అవగాహనతోనే అగ్ని ప్రమాదాల నివారణ



డెమో నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



నాలుగు రోడ్ల కూడలిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది



కైకలూరులో మహిళలకు సిలిండర్ల ప్రమాదాల నివారణపై అవగాహన కలిగిస్తున్న ఫైర్ సిబ్బంది

గుడివాడ టౌన్: అవగాహనతోనే అగ్ని ప్రమాదాలు నివారించడం సాధ్యమని అగ్ని మాపక శాఖ సహాయ అధికారి జె.ఆంజనేయులు తెలిపారు. పట్టణంలోని నాగవరప్పాడు కేపీఆర్ టవర్స్, టౌన్‌షిప్ టవర్స్ వద్ద ప్రజలకు ఆదివారం అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ వంట గదిలో గ్యాస్ లీక్ అయినప్పుడు భయపడకుండా గ్యాస్ రెగ్యులేటర్‌ను ఆఫ్ చేసే విధానం, గ్యాస్ సిలిండర్ బహిరంగ ప్రదేశానికి తీసుకురావడం, గ్యాస్ లీక్ అయ్యి మంటలు వ్యాపించినపుడు ఆ మంటలను మనకు అందుబాటులో ఉన్న వస్తువులతో ఏ విధముగా ఆర్పాలి తదితర అంశాలను అర్థమయ్యే విధంగా వివరించారు.

పామర్రు:వంట గదుల్లో అప్రమత్తంగా మెలగితే అగ్ని ప్రమాదాల నుంచి కాపాడుకోవచ్చునని అగ్నిమాపక కేంద్రం అధికారి రాంబాబు తెలిపారు. అగ్ని ప్రమాదాల నివారణ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పలు ప్రాంతాల్లోని ప్రజలకు అవగాహన కల్పించారు. నాలుగురోడ్ల కూడలి వద్ద ఉన్న దుకాణాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపార్టుమెంట్‌లలో ఫైర్ అలారం, ఫైర్ స్మోక్ డిటెక్టర్‌లను అవసరమైన ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. సెల్లార్‌లో ఆటోమేటిక్ స్ప్రింక్లర్లు ఉపయోగించాలని సూచించారు. పాఠశాలలు, వైద్యశాలల్లో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు క్షేమంగా తప్పించుకునేందుకు సరైన ప్రణాళికలు రచించి అందరికీ తెలిసే విధంగా తగు ప్రదేశాల్లో ఉంచాలన్నారు.

కై కలూరు: అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ అప్రమత్తతగా వ్యవహరించాలని కైకలూరు అగ్నిమాపక సిబ్బంది చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారానికి మూడో రోజుకు చేరాయి. కోరుకొల్లు రోడ్డు బృందావనం అపార్టుమెంటులో మహిళలకు ఎల్పీజీ సిలిండర్ల వాడకం, మంటలు వ్యాపించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఫైర్ స్టేషన్ సిబ్బంది సీహెచ్ శ్రీనివాసరావు, డి.రవీంద్రబాబు, బి.స్వామి పాల్గొన్నారు.

సుబ్బారాయుడి ఆలయంలో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం ప్రారంభంలో పాల్గొన్న ఆలయ చైర్మన్ నాగరాజు

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ చైర్మన్ శొంఠినాగరాజు చలివేంద్రాన్ని మజ్జిగ పంపిణీతో ప్రారంభించారు. తొలుత ఆలయ ప్రధానర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. చైర్మన్ మాట్లాడుతూ ఆలయానికి ప్రతిరోజూ భారీ సంఖ్యలో భక్తులు వస్తారని, వారికి తాగునీటి సమస్య తలెత్తకుండా చలివేంద్రాన్ని ఏర్పాటుచేశామన్నారు. జిల్లాలోని నలుమూలల నుంచి భక్తులు ఆదివారం ఆలయానికి చేరుకుని పుట్టలో పాలు పోసి స్వామిని దర్శించుకున్నారు. పాలపొంగళ్ళ శాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారుచేసి స్వామికి సమర్పించారు. నాగబంధాల వద్ద పూజలుచేయడంతోపాటు గోకులంలోని గోవులకు మహిళలు పసుపు, కుంకుమలతో పూజలు చేశారు.

మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే నాని



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే నాని

గుడివాడ టౌన్: సమస్యల పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కొడాలి శ్రీ వెంకటేశ్వరావు (నాని) తెలిపారు. పట్టణంలోని 23వ వార్డు సత్యనారాయణపురంలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మంచినీటి సమస్య ఎదుర్కొంటున్నట్లు మహిళలు శనివారం ఎమ్మెల్యే దృష్టికి తేగా దానిని వెంటనే పరిష్కరించినట్లు తెలిపారు. నీటిని మళ్లించే సమయాల్లో మార్పులు చేసి ఈ ప్రాంతానికి తాగునీరు అందిస్తున్నామన్నారు. ఉదయం ఐదు గంటల నుంచి సత్యనారాయణపురానికి నీరు విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు. ఆ సమయంలోనే నీటిని పట్టుకోవాలని సూచించారు. గుడ్‌మెన్ పేటలోని వాటర్ ట్యాంక్ పూర్తయ్యాక ఉదయం 6 గంటల నుంచే నీటి సరఫరా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం ప్రముఖ వైద్యుడు డాక్టర్ సోమరి వెంకటరమణను కలసి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ, తహసీల్దార్ కె.ఆంజనేయులు, వైఎస్సార్ సీపీ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, పాలేటి చంటి మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు వీరిశెట్టి నరసింహారావు, శ్రీనివాస చక్రవర్తి, చింతల భాస్కరరావు మహిళా కార్యకర్తలు వార్డు ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అంకమ్మతల్లి జాతర మహోత్సవం



మొక్కుబడులు తీర్చుకునేందుకు ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

పామర్రు(పమిడిముక్కల): మండల పరిధిలోని గురజాడ గ్రామంలో జంపాన వంశస్థులు నిర్వహిస్తున్న అంకమ్మ తల్లి సంబరాలు ఆదివారంతో ముగిశాయి. తొలుత ఆలయంలో భక్తులు విశేషంగా పూజలు చేశారు. ఉదయం అంకమ్మతల్లికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అంక గుడారాల చుట్టూ జంపాన ఆడపడుచులు అందరూ కలిసి భక్తిశ్రద్ధలతో ప్రదక్షిణలు చేశారు. పసుపు, కుంకుమ, చీర సారెను అమ్మవారికి సమర్పించారు. ఆలయం చుట్టూ పొట్టేళ్ల తిప్పి మొక్కుబడులు తీర్చుకున్నారు. అర్చకులు రొంపిచర్ల లోకాంత రంగప్రసాద్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. గ్రామం అంతా డప్పు వాయిద్యాలు, భక్తుల సందోహంతో నిండిపోయి జై అంకమ్మతల్లి అంటూ నినాదాలతో మార్మోగింది. భక్తుల రద్దీతో ఆలయం కిక్కిరిసిపోయింది. ఉయ్యూరు మున్సిపల్ చైర్మన్ వల్లభనేని నాని, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజులపాటి రామచంద్రరరావు, కౌన్సిలర్ల్ జంపాన పూర్ణిమ, రాజులపాటి చిన్ని, జంపాన ధనలక్ష్మీ, సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, ఎంపీటీసీ కూచిపూడి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్షీరబంధు చెక్కు పంపిణీ



మృతుడి కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ట్రస్టు బోర్డు సభ్యుడు కృష్ణారెడ్డి

పెదమద్దాలి(పామర్రు):పాలసేకరణ కేంద్రాల్లో పాలు పోసి మృతి చెందిన పాడి రైతులకు కృష్ణా క్షీర బంధు పథకం ద్వారా ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నామని కృష్ణా మిల్క్ యూనియన్ ట్రస్టు బోర్డు సభ్యుడు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి తెలిపారు. మండల పరిధి పెదమద్దాలి పాల సేకరణ కేంద్రంలో ఇటీవల మృతి చెందిన సభ్యులు ఆర్. కోటేశ్వరరావు కుటుంబానికి రూ.50 వేల చెక్కును ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ పాల ఉత్పత్తి దారుల అభ్యున్నతికి అనేక వినూత్న పథకాలను ప్రవేశ పెట్టి అందిస్తున్నామన్నారు. పాల ఉత్పత్తి దారుల అభ్యున్నతే ధ్యేయంగా యూనియన్ చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. పాడి రైతులకు సబ్సిడీలపై పశువుల దాణా, తెలగపిండి, గడ్డి జాతి విత్తనాలను అందిస్తున్నామన్నారు. పామర్రు పాలశీతల కేంద్రం మేనేజర్ చిట్టూరి దామోదర కృష్ణ గోపినాథ్, రూట్ సూపర్‌వైజర్ కె.రమేష్‌బాబు, వేతన కార్యదర్శి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

320 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గుడివాడటౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎంపీపీ పెయ్యల ఆదాం తెలిపారు. నందివాడ మండలం లక్ష్మీ నరసింహపురం జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదాం మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ వైద్య విభాగం, ఇలపర్రు ప్రాథమిక వ్యవసాయ పరిపతి సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. 320 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేశామని పేర్కొన్నారు. గుండె, దంత, కంటి, ఊపిరితిత్తులు, ఇతర విభాగాలకు చెందిన వైద్యులు ఈ శిబిరంలో పాల్గొన్నారు. అందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరాన్ని బట్టి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. కంటి చూపు తగ్గిన వారికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. వైద్య శిబిరంలో డాక్టర్ మలిరెడ్డి రవి, డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి, గుడివాడ లయన్స్ క్లబ్ కంటి వైద్య నిపుణులు, నందివాడ సచివాలయాల కన్వీనర్ దేశిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, ఇల్లపర్రు ప్రాథమిక వ్యవసాయ సహకార పరిపతి సంఘం అధ్యక్షుడు ఎస్. వెంకటరమణ, డైరెక్టర్లు బి.శ్రీనివాసరావు సీహెచ్ మురళీకృష్ణ, ఇలపర్రు సర్పంచ్ సత్తా మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులగణన నిర్ణయం హర్షణీయం

కైకలూరు: రాష్ట్రంలో బీసీ కులాలకు మరింత సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బీసీ కులగణనకు నిర్ణయం తీసుకోవడం చారిత్రాత్మకమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గంగునేని వరప్రసాద్ చెప్పారు. కైకలూరులో ఆదివారం ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా బీసీ జనగణన కోసం రాష్ట్ర వ్యాప్తంగా బీసీ సంఘాల డిమాండ్ చేస్తున్నాయని చెప్పారు. మహాత్మ జ్యోతిబా పూలే 132 జయంతి నాడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం ప్రకటించడంపై బీసీ సంఘాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయన్నారు. కులగణన వల్ల దామాషా ప్రకారం విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు ఇతర సదుపాయాలు దక్కుతాయన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల బీసీ నాయకులు జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అధ్వర్యంలో పలు పర్యాయాలు ఢిల్లీ వెళ్లి జంతర్ మంతర్ వద్ద ధర్నాలు చేశామన్నారు. రాష్ట్రంలో బీసీ వర్గాలన్నీ సీఎం జగన్‌కు అండగా ఉంటాయన్నారు.

సాగరతీరంలో పర్యాటకుల సందడి

కోడూరు: హంసలదీవి సాగరతీరం పర్యాటకులతో కళకళలాడింది. ఆదివారం సెలవుదినం కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన యాత్రికులు ప్రత్యేక వాహనాల్లో తీరానికి తరలివచ్చారు. సముద్ర అలల మధ్య కేరింతలు కొడుతూ సరదాగా గడిపారు. యువకులు బీచ్ వాలీబాల్ ఆటలతో సందడి చేయగా, చిన్నారులు, వృద్ధులు ఇసుక తిన్నెలపై సేదతీరుతూ ఉల్లాసంగా గడిపారు. పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు తీరంలో పటిష్టమైన గస్తీ ఏర్పాటు చేసి ఏవిధమైన అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.